
సాక్షి
పల్నాడు
మంగళవారం । 19 । ఆగస్టు । 2025



పులిచింతల సమాచారం

అచ్చంపేట: ఎగువ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 2,47,951 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 3,10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



ఘనంగా గంగమ్మ తల్లి వేడుకలు

వెల్దుర్తి: గుండ్లపాడులో వేంచేసియున్న గంగమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. భక్తులు మొక్కుబడులు చెల్లించి, నైవేద్యాలు సమర్పించారు.

ఎనిమిదో రోజుకు చేరిన దీక్ష



తెనాలిరూరల్: తెనాలి టెలిఫోన్ ఎక్స్ఛేంజి ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటుకు అప్పజెప్పడాన్ని నిరసిస్తూ టెలికాం ఉద్యోగిని కె.పద్మావతి చేపట్టిన నిరసన సోమవారం ఎనిమిదో రోజుకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంగళగిరిలో సీఎం పర్యటన



మంగళగిరి టౌన్: మంగళగిరిలో మంగళవారం, బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం అధికారులతో కలసి పరిశీలించారు. నగర పరిధిలోని సీకే కన్వెన్షన్‌లో జీరో ప్రావర్టీ పి–4 కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. సీటింగ్, సభాస్థలి, వీడియో గ్యాలరీ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నగర పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ ఫ్లయి ఓవర్ వద్ద ఉన్న మయూరి టెక్ పార్క్‌లో బుధవారం జరగనున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొననున్న దృష్ట్యా, అక్కడి ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సమన్వయంతో విధులు నిర్వహించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల కో–ఆర్డినేటర్, శాసనమండలి సభ్యులు పెందుర్తి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ప్లానింగ్ శాఖ జాయింట్ సెక్రటరీ శంకరరావు, సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, సీఎంఓ కార్యాలయ అధికారి ఇక్బాల్ సాహెబ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా పాల్గొన్నారు.

వినుకొండ ఫొటోగ్రాఫర్లకు అవార్డులు





వినుకొండ: ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వినుకొండ ఫొటోగ్రాఫర్లు వంగపల్లి బ్రహ్మయ్య, కేసానుపల్లి సుబ్బారావులు అవార్డులు అందుకున్నారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న ఇరువురిని వినుకొండ ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

విరిగిన ఇనుప గడ్డర్‌తో ఇబ్బందులు



తెనాలి రూరల్: తెనాలి–చందోలు మార్గంలోని వైకుంఠపురం రైల్వే వంతెన వద్ద తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో వంతెన దెబ్బతినకుండా ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో విరిగి కింద పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం మరమ్మతులు చేయించారు. తరచూ గడ్డర్ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గాంధీ ఆశ్రమానికి రూ.లక్ష విరాళం



తెనాలి అర్బన్: పెదరావూరుకు చెందిన షేక్ హనీఫ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బాషా మహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమ నిర్వాహణకు రూ.లక్ష చెక్కును నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి అందజేశారు. బుర్రిపాలెం రోడ్డులోని ఆశ్రమంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో షేక్ జానీ సైదా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంతేనా.. రికవరీ!

పోగొట్టుకుంది కొండంత.. వసూలు గోరంత

ఒకటికి పది రెట్లు వస్తాయన్న ఆశతో యానిమేషన్ వలలో చిక్కుకున్న బాధితులకు న్యాయం అందని ద్రాక్షగానే మిగిలేలా ఉంది. ఇంతకాలం పోలీసులపై పెట్టుకున్న నమ్మకం తాజాగా అరెస్టులతో నీరుగారింది. నష్టం రూ.వందల కోట్లలో ఉంటే రికవరీ మాత్రం అందులో పది శాతం కూడా లేకపోవడం గమనార్హం. రూపాయి రూపాయి కూడగట్టిన సొమ్ము నమ్మకంగా పెట్టుబడి పెడితే నట్టేట మునిగిపోయామనే దిగులు నిలువెల్లా కుంగదీస్తోంది. ఇప్పటికే ఈ స్కాముకు ఒకరు బలికాగా.. మిగతావారు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు.



- యానిమేషన్ స్కామ్ బాధితుల ఆవేదన
- తాము పోగొట్టుకున్న సొమ్ములో పదోశాతం సైతం లేదంటూ గగ్గోలు
- నిందితుల ఆస్తులు సైతం అటాచ్ చేయని పోలీసులు
- దారి మళ్లించిన డబ్బులపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు
- ఇన్ని రోజులు ఎదురుచూసినా బాధితులకు దక్కని న్యాయం
- సుమారు రూ.200 కోట్లు పోగొట్టుకున్న నరసరావుపేట వాసులు
- ఇప్పటికే ఈ కేసులో ఒకరు గుండెపోటుతో మృతి
- తమ డబ్బు ఇక రాదేమోనని కుంగిపోతున్న బాధితులు

నరసరావుపేట టౌన్: ఒక్కసారిగా ధనవంతులు కావాలంటే.. కష్టపడకుండా డబ్బులు సంపాదించాలంటే నమ్మకమే పెట్టుబడి. అమాయకుల అత్యాశే రాబడి. ఇదే సూత్రాన్ని అమలు చేసి కొందరు మాయగాళ్లు.. జేబులు గుల్ల చేస్తున్నారు. ఈ కోవలో మోసాలకు నరసరావుపేట కేంద్రంగా మారింది. కొన్ని నెలల కిందట బయటపడిన యానిమేషన్ స్కామ్‌లో బాధితులు అత్యధికంగా నరసరావుపేటలోనే ఉన్నారు. రూ.పది పెట్టుబడి పెడితే రూ.వంద వస్తాయని నమ్మబలకటంతో బాధితులంతా నమ్మి పెట్టుబడి పెట్టారు. ఇలా నరసరావుపేటలోనే సుమారు రూ.200 కోట్లకుపైగా పెట్టుబడి పెట్టి మోసపోయారు.

అధిక లాభాలకు ఆశపడి..

విజయవాడ పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుల్లో గుంటూరుకు చెందిన మిట్టపల్లి రాజేంద్రప్రసాద్ అలియాస్ రాజు నరసరావుపేటకి చెందిన ఓ ప్రముఖ బంగారం వ్యాపారి అల్లుడు. దీంతో అతనికి నరసరావుపేటలోని వ్యాపారులు, ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాయి. యానిమేషన్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి అనేక మందితో రూ.కోట్ల పెట్టుబడులు పెట్టించాడు. నిందితుడికి సమీప బంధువైన నరసరావుపేటకు చెందిన పొగాకు వ్యాపారి అతని మాటలు నమ్మి పెద్ద మొత్తంలో అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టి మోసపోయి దీవాళా తీశాడు. ఉన్న ఆస్తుల కంటే అప్పులే అధికంగా ఉండటంతో ఐపీ పెట్టే పరిస్థితికి వచ్చాడు. మరో బంగారం హోల్‌సేల్ వ్యాపారి కూడా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి నష్టపోయాడు. నిందితుడు మిట్టపల్లి రాజును శుక్రవారం నరసరావుపేటలోని అతని బావమరిది ఇంట్లో అదుపులోకి తీసుకున్న విజయవాడ పోలీసులు శనివారం అరెస్ట్ చూపారు. రాజు జనాల వద్ద దోచుకున్న డబ్బును అనేక రూపాల్లో దారి మళ్లించినట్టు పోలీసులు గుర్తించారు. బంగారం, బినామీల పేరుతో ఆస్తులు కూడగట్టినట్టు సమాచారం. అయితే పోలీసులు వాటిపై దృష్టి సారించకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

ఫిర్యాదు బెజవాడలో..

యానిమేషన్ స్కాంపై మొదట పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కేసు నమోదు అవ్వాల్సి ఉంది. బాధితులు ఫిర్యాదు చేసేందుకు తొలుత నరసరావుపేట పోలీస్ స్టేషన్లకు వెళ్లారు. అయితే ఈ స్కామ్ ప్రధాన కార్యాలయం విజయవాడలో ఉందని, అక్కడ ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉన్నా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో బాధితులు విజయవాడ పోలీసులను సంప్రదించారు. అక్కడ కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కేసు స్థాయినిబట్టి సిట్‌ను ఏర్పాటు చేయడంతో బాధితులు తమకు న్యాయం జరుగుతుందని ఆశలు పెట్టుకున్నారు. అయితే పోలీసు విచారణ అనంతరం రికవరీని చూసిన బాధితులు నీరుగారిపోయారు.

స్కాంలకు కేంద్రం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నరసరావుపేట స్కాముల కేంద్రంగా మారింది. ఇక్కడ పుల్లారావు సాయిసాధన చిట్ ఫండ్ పేరిట భారీగా వసూళ్లు చేసి బోర్డు తిప్పేశాడు. పోలీసులు ఈ కేసులో హడావుడి చేసి చివరకు బాధితులను వదిలేశారు. బాధితులు సీఎం చంద్రబాబు నాయుడును కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. యానిమేషన్ స్కాములోనూ అత్యధిక మంది నరసరావుపేట వాసులే ఉన్నారు. వీరు కూడా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసి న్యాయం కోసం వేడుకున్నా.. చివరకు అన్యాయమే జరిగిందని గుండెలు బాదుకుంటున్నారు. ఇప్పటికే ఓ బాధితుడు మోసాన్ని భరించలేక గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. రికవరీ జరుగుతుంది.. తమకు న్యాయం జరుగుతుందని ఆశించిన బాధితులు తాజా పరిణామాలతో ఢీలాపడ్డారు. ప్రభుత్వం న్యాయం చేయకపోతే అనేకమంది బాధితులు నేడు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది.

పదోవంతు కూడా లేదు

యానిమేషన్ స్కాం మొత్తం రూ.400 కోట్ల దాకా ఉండగా అందులో నరసరావుపేటకు చెందిన అనేక మంది వ్యాపారుల సొమ్మే సుమారు రూ.200 కోట్ల వరకు ఉంది. తమ పెట్టుబడికి అధికంగా డబ్బులు వస్తాయని నమ్మారు. అయితే బోర్డు తిప్పేశాక వారంతా వేదనలో ఉన్నారు. చివరకు పోలీసులపై ఆశలు పెట్టుకుంటే.. వారు చేసిన రికవరీ అంతా కలిపినా కూడా పోగొట్టుకున్న దానిలో పదో వంతు కూడా లేదు. ఇదే కాకుండా నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. వారి ఆస్తులను పూర్తిస్థాయిలో అటాచ్ చేయలేదు. దీంతో తమకు న్యాయం ఎప్పుడు? ఎలా ? జరుగుతుందో తెలియక బాధితులు వేదన పడుతున్నారు.

పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



తాడికొండ: అమరావతిలోని వేంకటపాలెంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆగస్టు 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. లోక కల్యాణార్థం మొదటిసారిగా ఆలయంలో పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం అర్చకులు విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, ఆచార్య ఋత్విక్ వరణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. 19వ తేదీ ఉదయం పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ఠ అధివాసం, సర్వదైవత్య హోమం చేపడుతారు. 20న ఉదయం పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, ప్రధాన హోమాలు, స్నపన తిరుమంజనం, పవిత్రాభిమంత్రణ, పవిత్ర సమర్పణం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, మహా శాంతి హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. 21వ తేదీ ఉదయం పుణ్యాహవచనం, యాగశాల వైదిక కార్యక్రమాలు, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, ఆచార్య, ఆగమ సలహాదారు, ఋత్విక్కులకు బహుమానం, యాజమాన ఆశీర్వాదనం చేపట్టనున్నారు. కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ ఎం.మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఏ. రామకృష్ణ, ఎం.సందీప్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్, జేసీ

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ద్వారా జిల్లా నలుమూలలు నుంచి వచ్చిన అర్జీదారులు నుంచి 141 అర్జీలను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి, అధికారులతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో సంతృప్తే ధ్యేయంగా పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ–ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సదరమ్ సర్టిఫికెట్‌లో తప్పులను సరిదిద్దండి



నేను దివ్యాంగుడిని, నాకు ప్రభుత్వ పింఛన్ అందుతుంది. 2017లో సదరమ్ సర్టిఫికెట్ తీసుకున్నా. అందులో పేరు, పుట్టిన తేదీ తప్పు పడింది. సరిచేయాలని కోరాను.

–సయ్యద్ వాసిమ్ అక్రమ్, బరంపేట, నరసరావుపేట

బార్ అండ్ రెస్టారెంట్‌లకు దరఖాస్తులు

- జిల్లాలో కొత్తగా 54 బార్‌లకు అనుమతులు
- 28వ తేదీన లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలో 54 బార్ అండ్ రెస్టారెంట్‌లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.మణికంఠ తెలిపారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 49, గీత కార్మిక కులాలకు 5 బార్ అండ్ రెస్టారెంట్‌లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. మున్సిపాలిటీలకు సంబంధించి ఏడాదికి రూ.55 లక్షలు, నగర పంచాయతీలకు రూ.35 లక్షలుగా ఫీజు నిర్ధారించిందన్నారు. ఆరు విడతలుగా లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే గీత కార్మికులకు కేటాయించిన బార్‌లకు నిర్దేశించి లైసెన్స్ ఫీజులో సగం మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు.



మాట్లాడుతున్న ఈఎస్ మణికంఠ, పక్కన ఏఈఎస్ రవీంద్ర, సీఐ సోమయ్య

- నరసరావుపేట 18, చిలకలూరిపేట 11, సత్తెనపల్లి 5, పిడుగురాళ్ల 6, మాచర్ల 5, వినుకొండ 6, గురజాల 1, దాచేపల్లి 2 బార్ అండ్ రెస్టారెంట్లకు నేటి నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 28వ తేదీ లాటరీ పద్ధతిలో జిల్లా కలెక్టర్ సమక్షంలో కేటాయింపు జరుగుతుందన్నారు. అదే విధంగా గీత కార్మికులకు కేటాయించిన బార్ అండ్ రెస్టారెంట్‌ల దరఖాస్తులకు 29వ తేదీ చివరి తేదీ అన్నారు. వారికి 30వ తేదీ లాటరీ తీయటం జరుగుతుందన్నారు.
- ఒక్కో దరఖాస్తుకు నాన్ రిఫండ్‌బుల్ దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రతి బార్ అండ్ రెస్టారెంట్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు ఉండాలన్నారు. నిర్దేశించిన దరఖాస్తులు రాకుంటే ఆయా బార్‌లకు తిరిగి టెండర్ కోరటం జరుగుతుందన్నారు.
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఒక వ్యక్తి ఎన్ని బార్‌లకైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లాటరీ పద్ధతిలో కేటాయించబడిన వెంటనే సంవత్సరం లైసెన్స్ ఫీజులో ఆరో వంతు అదే రోజు చలనా రూపంలో చెల్లించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వహణకు ప్రభుత్వం సమయపాలన విధించిందన్నారు. కార్యక్రమంలో ఏఈఎస్ రవీంద్ర, సీఐ సోమయ్య పాల్గొన్నారు.

వైఆర్ఎస్ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

రెంటచింతల: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. ఈ నెల 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 'మహాత్ముడు నడయాడిన రెంటచింతల' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పందించి, నాడు మహాత్ముడు బస చేసిన వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. స్వాతంత్య్ర పోరాటంలో గ్రామానికి చెందిన పల్నాటి గాంధీగా పేరు పొందిన నాళం మట్టపల్లి కుటుంబ సభ్యులను కలువడానికి అవకాశం ఉందా? ఆయన వారసులు ఎవరు.. ఎక్కడున్నారని.. వాకబు చేశారు. స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో ఈ ప్రాంతంలో నెలకొన్న సంగతులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వైఆర్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో మమేకమై, వారికి పలు సూచనలు చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య, విద్యా వలంటీర్ల వేతనాలు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల వెనుకనున్న గదులను ఎందుకు మూసివేశారని అడిగారు. ప్రస్తుతం ఐదుగురు మాత్రమే ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఉన్నారని, మిగిలిన వారు విద్యా వలంటీర్లుగా పనిచేస్తున్నారని వారికి పూర్వ విద్యార్థులు అందజేసిన విరాళాలతో వేతనాలు అందచేస్తున్నామని గతంలో 700 మందికి పైగా విద్యార్థులు ఉండేవారని హెచ్‌ఎం కొత్త చంద్రశేఖర్, కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్యలు కలెక్టర్‌కు వివరించారు.

- తొలుత పాఠశాల ఆవరణలోని మహాత్ముని విగ్రహానికి గురజాల ఆర్డీఓ మురళీకృష్ణతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గతేడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నాదెండ్ల అమర వెంకటేష్‌కు ప్రోత్సాహక నగదు అందజేశారు. తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకం, ఎంఈఓ–2 వై.శివ నాగేశ్వరరావు, హెచ్‌ఎం కె.చంద్రశేఖర్, కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య, ఎంపీటీసీ పాముల సంపూర్ణమ్మ, వార్డెన్ నూరెల్లా బేగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలలో మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఆర్డీఓ

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిశీలన

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టును పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సోమవారం పరిశీలించారు. సాగర్ రేడియల్ క్రస్టుగేట్లను పరిశీలించి, సాగర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, కుడి,ఎడమ కాలువలకు విడుదలయ్యే నీటి విడుదల గురించి ఇరిగేషన్ ఈఈ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ప్రాజెక్టు 3,31,000 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు నుంచి 2,93,000 క్యూసెక్కులు విడుదలవుతుందని కలెక్టర్‌కు ఈఈ వివరించారు. మరో 13టీఎంసీల నీరు నిల్వ చేయవచ్చని కలెక్టర్‌కు తెలిపారు. వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట గురజాల ఆర్డీఓ మురళి, మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్, డీఈలు శ్రీకాంత్, మురళీధర్ ఉన్నారు.

కృష్ణవేణి.. ఉగ్రరూపిణి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఒకవైపు కృష్ణమ్మ వరద దోబూచులాటలు.. మరోవైపు ముసురుతో రైతులకు కంటి మీద కునుకు కరువైంది. వరుణుడి ప్రకోపంతో అల్లాడుతున్నారు. వర్షాలు తగ్గడంతో పంట ముంపు నుంచి బయటపడతామనే ఆశతో ఉన్న రైతులకు నిరాశే ఎదురైంది. మళ్లీ వర్షాలు కురుస్తుండటం, వాతావరణ శాఖ అధికారులు కూడా భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలతో ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో పాటు ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లాలోని 15 మండలాల్లో ఆదివారం రాత్రి నుంచి ఒక మోస్తరు వర్షం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా కాకుమాను మండలంలో 37.2 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా గుంటూరు పశ్చిమలో 0.6 మి.మీ. పడింది. సగటున 8.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

బ్యారేజీకి వరద నీరు తాకిడి

మరోవైపు ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి క్రమేపీ పెరుగుతోంది. రెండు రోజుల కిందట రెండో ప్రమాద హెచ్చరిక వరకూ వెళ్లి, మళ్లీ వరద ప్రవాహం తగ్గుతూ వచ్చిన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ నిదానంగా నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది. సోమవారం బ్యారేజీకి వచ్చిన 2.84 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం నాటికి 3.97 లక్షల క్యూసెక్కుల నీరు వద్దకు వచ్చే అవకాశముందని, ఆ తర్వాత రోజుకు సుమారు ఏడు లక్షల నీటి ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతంలో వర్షాలు కొనసాగితే మరింత ఉధృతి పెరిగే అవకాశం కనపడుతోంది.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి సోమవారం 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. 2,51,182 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 3,31,699 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



సీతానగరం పుష్కర ఘాట్లలో ఇనప కంచె ఏర్పాటు చేయిస్తున్న ఎస్‌ఐ ఖాజావలి

రెంటచింతల మండలం సత్రశాల వద్ద నున్న నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి 16 క్రస్ట్‌గేట్లు ద్వారా 2,92,192 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు.

నిండుకుండలా పులి చింతల

మరోవైపు పులిచింతల ప్రాజెక్టుకు సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 2,47,951 క్యూసెక్కులు వచ్చి చేరింది. దిగువకు 10 క్రస్ట్ గేట్లద్వారా 3,10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

పుష్కర ఘాట్ల వద్ద ఇనుప కంచెలు

తాడేపల్లి రూరల్: కృష్ణా నదికి వరద నీరు భారీగా వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతంలోని పుష్కర ఘాట్లలో భద్రత దృష్ట్యా సోమవారం తాడేపల్లి పోలీసులు ఇనప ముళ్లకంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ కృష్ణా నది ఎగువ ప్రాంతం నుంచి భారీగా వస్తున్న వరద నీటిని ఇరిగేషన్ అధికారులు దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నారన్నారు. పుష్కర ఘాట్ల వద్ద సందర్శకులు మెట్ల మీద నుంచి నీళ్లలోకి దిగుతున్నారని తెలిపారు.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,541
అమ్మకాలు	42,285
నిల్వ	7,029

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,200
341	10,000-14,600
సూపర్ -10	10,000-13,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-14,200
నంబరు-5	10,000-13,500
341	11,000-14,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,500
బాడిగ 5531	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,300
ఆర్మూర్	9,800 - 11,200
తాలుకాయలు	6,000 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్-1	10,000-13,200
బాడిగ - 5531	10,000-12,100
ఆర్మూరు	10,200 - 13500
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

- జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు
- పీజీఆర్ఎస్‌లో 86 అర్జీలు స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి, మోసం తదితర సమస్యలకు సంబంధించిన 86 ఫిర్యాదులు అందాయి. పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు.

ఐటీ జాబ్స్ పేరిట మోసం

మేం ముగ్గురం ఎంసీఏలు పూర్తిచేసి ఉద్యోగాల కోసం హైదరాబాద్ వెళ్లాం. అక్కడ కాసరగడ్డ నరేంద్ర అనే అతను ఐటీ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఇందుకు రూ.4లక్షలు చెల్లించాలని చెప్పాడు. నమ్మి ముగ్గురం కలిపి రూ.4లక్షలు చెల్లించాం. అయితే ఆరు నెలలు గడుస్తున్నా, జాబ్‌లు చూపించకుండా, డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు.

– షేక్ రబ్బాని, షేక్ ఖాజా మొహిద్దీన్, షేక్ మస్తాన్‌బాషా

వినాయకుని ఊరేగింపునకు అవకాశం కల్పించాలి

గ్రామంలోని ఎస్టీ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా గణేష్ పందిరి ఏర్పాటుచేసి పూజలు నిర్వహిస్తున్నాం. నిమజ్జనం సందర్భంగా గత ఏడాది గ్రామంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా అగ్రకులాల వారు అడ్డుకున్నారు. ఈ ఏడాది కూడా అడ్డుకోవాలనే ప్రయత్నంలో ఉన్నారని సమాచారం ఉంది. గ్రామంలో ఊరేగింపు సక్రమంగా జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– ఎస్టీ కాలనీ వాసులు, పెద రెడ్డిపాలెం

రూ.35.50లక్షలకు మోసం

జాబ్‌తో పాటు కమీషన్ ఇప్పిస్తామని ఓ ప్రాపర్టీస్ సంస్థ ప్రతినిధులు రూ.35.50లక్షలు మోసం చేశారు. నా ఫోన్ నెంబరుతో వర్క్ ఫ్రం హోం ప్లాట్‌ఫామ్‌తో పాటు ఐడీని క్రియేట్ చేసి డబ్బులు వస్తాయని ఆశ చూపించారు. ప్రాజెక్ట్ వర్క్ అని చెప్పి 20 ప్రాజెక్ట్‌ల నుంచి కమీషన్ ఇస్తామని నమ్మించారు. దీనిని నమ్మి ఈ ఏడాది జూలై 28వ తేదీ నుంచి ఈనెల 13వ తేదీ వరకు సుమారు రూ.35.50లక్షలు ఫోన్ పే ద్వారా పంపించాను. కమీషన్ నగదు అడగ్గా సదరు ప్రాపర్టీస్ ప్రతినిధులు మరో రూ.5లక్షలు చెల్లిస్తే మొత్తం ఇస్తామని చెబుతున్నారు. మోసపోయాను.. సదరు సంస్థ నుంచి నగదు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి.

– తోట అజయ్, వినుకొండ

పిడుగు గుట్టు.. పసిగట్టు!

- వర్షాకాలంలో పిడుగులతో పొంచి ఉన్న ముప్పు
- ప్రాణాలపై పిడుగుపాటు
- 'దామిని లైట్నింగ్' యాప్‌తో పిడుగుల ముందస్తు హెచ్చరికలు
- జాగ్రత్తలు పాటిస్తే బయటపడ వచ్చంటున్న నిపుణులు

బెల్లంకొండ: వర్షాకాలం వచ్చిందంటే ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుంటాయి. పిడుగులు కూడా పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిడుగు ఎప్పుడు పడుతుందో.. ఎలా పడుతుందో తెలియని పరిస్థితిలో ప్రమాదాలు వాటిల్లి ఒక్కోసారి ప్రాణ నష్టం కూడా సంభవిస్తుంది. అదేవిధంగా మెరుపుల దాటికి గృహోపకరణాలు కూడా కాలిపోతూ ఉంటాయి. పిడుగులోని కాంతి ప్రభావంతో నష్టం భారీగానే కలుగుతుంది. ఈ పరిస్థితుల్లో పిడుగు నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంటుంది. పిడుగుపాటును ముందే తెలుసుకోగలిగితే ప్రాణాలు కాపాడుకోవచ్చు. ఈ పిడుగు ప్రమాదాన్ని 'దామిని లైట్నింగ్ యాప్'తో అరగంట ముందే గుర్తించగలిగే అవకాశం ఉంది.



ముప్పు ముందే తెలుసుకోవచ్చు

పూణే కేంద్రంగా ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ (ఐఐటీఎం) నాలుగేళ్ల క్రితం ఈ యాప్‌ను రూపొందించింది. పిడుగుపాటును గుర్తించేందుకు దేశవ్యాప్తంగా వివిధ నగరాలలో 83 చోట్ల ప్రత్యేక సెన్సార్లను అమర్చారు.

- ముందుగా ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆపిల్ యాప్ స్టోర్ లోకి వెళ్లి.. దామిని లైటింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

కలర్‌తో కనుక్కోవచ్చు

ఎరుపు : మీరు ఉన్న ప్రాంతంలో మరో ఏడు నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే యాప్‌లోని సర్కిల్ ఎరుపు రంగులోకి మారుతుంది.

పసుపు : మరో 10 నుంచి 15 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే యాప్ లోని సర్కిల్ పసుపు కలర్ లోకి మారుతుంది.

నీలం : 15 నుంచి 25 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ బ్లూ కలర్‌లోకి మారిపోతుంది.

- తర్వాత పేరు, మొబైల్ నెంబర్, అడ్రస్, పిన్‌కోడ్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. జీపీఎస్ లొకేషన్ తెలుసుకోవడం కోసం యాప్‌కు పర్మిషన్ ఇవ్వాలి.
- మీ ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో తెలుసుకోవడానికి మూడు రంగులను ఐడెంటిఫికేషన్ కలర్స్ కింద చూపిస్తుంది. వాటి ఆధారంగా మీరు ఉన్నచోట పిడుగు పడే అవకాశం ఉంటే ముందే హెచ్చరిస్తుంది.

కాపర్ ఎర్త్‌వైర్‌తో ప్రమాదాలకు చెక్..

ఇంటి పరిసర ప్రాంతాల్లో పిడుగుపాటు నుంచి కాపర్ ఎర్త్ వైర్ ఏర్పాటుతో తప్పించుకునే అవకాశం ఉంది. ఇంటి ఆవరణలో కొంత ఎత్తయిన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ (రాగి వైర్ ను అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటు చేయడం ద్వారా దాదాపుగా కిలోమీటర్ దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఇదే ఆకర్షించుకుంటుంది. ఎర్త్ వైర్‌ను ఉప్పు, కర్ర బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్‌ను భూమి లోపలికి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు..



- వర్షం వచ్చేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు. ముఖ్యంగా ఎత్తయిన చెట్ల కింద అస్సలు ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల వద్ద బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు.
- లక్షల డిగ్రీల ఉష్ణోగ్రతతో విడుదలయ్యే వేడి ఒక్కసారిగా మనిషిని చేరగానే గుండెపై ప్రభావం చూపుతుంది.
- వర్షపు సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోల్టులు, సెల్‌ఫోన్లు, కెమెరాలు దగ్గర లేకుండా చూసుకోవాలి. ఫోన్ల నుంచి వచ్చే సిగ్నల్ పిడుగు పడే అవకాశాన్ని ఎక్కువ చేస్తుంది.
- మెరుపులు, పిడుగుల వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే అవకాశం ఉంది. ఆ సమయంలో టీవీలకు ఉన్న విద్యుత్, కేబుల్ కనెక్షన్లు తొలగించాలి.
- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్స్ సమీపంలో ఉండకూడదు. తడి ప్రదేశాల్లో ఉండకపోవడం చాలా మంచిది.

అప్రమత్తంగా ఉండాలి

వాతావరణంలో మార్పులు జరిగి వర్షాలు పడుతున్న సమయంలో బయటకు వెళ్లకుండా పనులు ఆపుకొంటే మంచిది. అత్యవసర పనులు ఉండి వర్షంలో బయటకు వెళ్లిన సమయంలో దామిని లైటింగ్ యాప్ ఉపయోగించి పిడుగు ఎక్కడ పడుతుందో.. ఏ సమయంలో పడుతుందో పసికట్టవచ్చు. తద్వారా ప్రమాదానికి గురికాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

– ప్రవీణ్ కుమార్, తహసీల్దార్, బెల్లంకొండ

ఉచిత ఉపకరణాలు వినియోగించుకోండి

జిల్లా సహిత విద్య సమన్వయకర్త సెల్వరాజ్



చిన్నారులకు నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డాక్టర్ నితిన్

పెదకూరపాడు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ప్రభుత్వం అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా సహిత విద్య సమన్వయకర్త సెల్వరాజ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. సెల్వరాజ్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో 520 మంది విద్యార్థులు భవిత పాఠశాలలో ఉన్నారని తెలిపారు. వారిలో ఉపకరణాల అవసరమైన వారికి నిర్ధారణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆడియాలజిస్ట్, సైకాలజిస్ట్, ఆర్థోపెడిక్ సంబంధించిన ప్రత్యేక ప్రతిభావంతులను ఢిల్లీ నుంచి వచ్చిన వైద్య బందం ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకారణాలను అందించేలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తారన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన వైద్య బృందం డాక్టర్ నితీష్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాదరావు, సత్యనారాయణ, హెచ్ఎం కేవీ రమణ, స్కూల్ అసిస్టెంట్లు సుబ్బారావు, సుశిత్రాప్రియ, లక్ష్మీనారాయణ, నూర్జహాన్, అచ్చయ్య, నసీమా బిగ్, బాబు, ఐఈఆర్పీ టీచర్లు లక్ష్మీ, కమల, స్వాతి, రమాదేవి, రహీం తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు వెన్నుపోటు

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మేరి



నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పరిపాలన ఆడపడుచులకు వెన్నుపోటు పొడిచే విధంగా ఉందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, పల్నాడు జిల్లా మహిళా విభాగం ఇన్‌చార్జి బుల్లా మేరి ఆరోపించారు. నగరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళల్ని కూటమి ప్రభుత్వం మభ్యపెడుతోందని చెప్పారు. ఏ బస్సులోనైనా రాష్ట్రమంతా తిరగవచ్చని ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. కానీ నేడు మాత్రం కొన్ని బస్సులకే పరిమితం చేసి మహిళలని మరోసారి మోసం చేశారని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని నమ్ముకుని బయటకు వచ్చే మహిళలకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని తెలిపారు. అనేక బస్సుల్లో ఫ్రీ టికెట్ ఇవ్వకుండా బస్సులోంచి నిర్దాక్షిణ్యంగా మహిళల్ని దించేస్తున్నారని ఆరోపించారు.

డాక్టర్ సుమితా శంకర్ ఆవిష్కరణకు పేటెంట్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్ ఆవిష్కరించిన 'నెగటివ్ ప్రెషర్ ఆధారిత లింబ్ డీకాంజెషన్ స్లీవ్'కు పేటెంట్ లభించింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం నుంచి ఆమె అభివృద్ధి చేసిన వైద్య పరికరం (డిజైన్ నం. 459230-001)కు సర్టిఫికెట్ లభించింది. ఈ వినూత్న పరికరం చేతులు, కాళ్ల వాపు, వెనస్ కాంజెషన్, సంక్లిష్ట గాయాల చికిత్సలో కొత్త మార్గాన్ని అందిస్తుంది. నియంత్రిత నెగటివ్ ప్రెషర్ ద్వారా వాపును తగ్గించడం, రక్తప్రసరణ మెరుగుపరచడం, గాయాల మాన్పును వేగవంతం చేయడం దీని ప్రధాన లక్ష్యం. ఈ పరికరాన్ని డాక్టర్ కృతి నందూరి సహ ఆవిష్కర్తగా వ్యవహరించారు. డాక్టర్ సుమితా శంకర్ తక్కువ ఖర్చుతో, రోగులకు అనుకూలమైన, గ్రామీణ, పట్టణ ఆరోగ్య సేవలకు అందుబాటులో ఉండే విధంగా పరికరాన్ని రూపకల్పన చేశారు. తన ఆవిష్కరణకు పేటెంట్ లభించిన సందర్భంగా డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ ఈ గుర్తింపు కేవలం డిజైన్ రక్షణ మాత్రమే కాదని, గాయాల సంరక్షణలో కొత్త ఆశలు తెరవడమేనని పేర్కొన్నారు. డిజైన్ యాక్ట్ - 2000 ప్రకారం పది సంవత్సరాల పాటు ఈ డిజైన్ పేటెంట్ ఉంటుందని, దీన్ని గరిష్ఠంగా 15 సంవత్సరాల వరకు పొడిగించవచ్చని తెలిపారు. దీని ద్వారా ఆవిష్కర్తలు పరికరాన్ని మరింత అభివృద్ధి చేసి, మార్కెట్ చేసుకునేందుకు ప్రత్యేక హక్కులను పొందుతారని పేర్కొన్నారు. ఇకపై తమ బృందం క్లినికల్ ధ్రువీకరణ, అకడమిక్ ప్రచురణలు, సహకారాలు ద్వారా దీన్ని మరింత విస్తరించడానికి యోచిస్తోందని డాక్టర్ సుమితా శంకర్ వెల్లడించారు.

సీజీహెచ్‌ఎస్‌లో ఆధునిక సౌకర్యాలు

చీఫ్ మెడికల్ ఆఫీసర్ కోటేశ్వరరావు



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు

గుంటూరు మెడికల్: మారుతున్న కాలానుగుణంగా అత్యాధునిక వైద్య సదుపాయాలతో సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్(సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సీహెచ్.కోటేశ్వరరావు పేర్కొన్నారు. నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ కార్యాలయంలో సోమవారం నూతనంగా ఏర్పాటైన లేబొరేటరీ, ఇంజెక్షన్, బీపీ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి సీజీహెచ్ఎస్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి.హేమాసుందరి అధ్యక్షత వహించారు. డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా, సీజీహెచ్ఎస్ ఆరోగ్య కేంద్రాలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరింత మెరుగైన స్థితికి తీసుకొస్తామని వెల్లడించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.విద్య మాట్లాడుతూ నూతన ప్రారంభోత్సవాల ద్వారా మరిన్ని వైద్య సౌకర్యాలకు అంకురార్పణ జరిగిందని తెలిపారు. రోగుల ఆరోగ్య సంక్షేమమే తమ లక్ష్యమని చెప్పారు. సీజీహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ ఆస్పత్రిలో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ఉద్యోగులు, పెన్షనర్లలో ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి.హేమా సుందరి, ఫార్మాసిస్టు ఆయేషా బేగం, సునీల్, లేబొరేటరీ అసిస్టెంట్లు మురళి, రామారావు, సిబ్బంది మోహన్, మక్బూల్, వెంకటేశ్వర్లు, రత్నరాజు, నందమణి పాల్గొన్నారు.

బాపట్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు



మురుగునీటిలో గంబూషియా చేప పిల్లలను వదులుతున్న మున్సిపల్ అధికారులు

బాపట్ల అర్బన్: వర్షాలు, వరదలు దృష్ట్యా పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని పలు డ్రెయినేజీలు, నీటి కుంటలలో దోమలు ఉత్పత్తి జరగకుండా గంబూషియా చేప పిల్లలను సోమవారం వదిలే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఖాళీలను యజమానులు శుభ్రం చేయించుకోవాలని, పిచ్చిమొక్కలు, అపరిశుభ్రంగా ఉంటే సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. పురప్రజలు కూడా మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, నజీర్ ఉన్నారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి
ఫొటోగ్రఫీ పోటీల విజేతలు



కలర్ విభాగంలో ప్రథమ బహుమతి 'విద్యార్థినిపై పోలీసు జులుం'



'మోనోక్రోమ్‌లో ప్రథమ బహుమతి "నీరు విలువైనది'

తెనాలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ సహకారంతో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల విజేతలను సోమవారం తెనాలిలో ప్రకటించారు. డాక్టర్ ఎస్.భగవాన్‌దాస్, బండి రాజన్‌బాబు స్మారకార్థం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఈ పోటీలను నిర్వహించారు. కలర్ విభాగంలో బి.జోగారావు తీసిన 'విద్యార్థినిపై పోలీసు జులుం' ఫొటో ప్రథమ బహుమతికి ఎంపికకాగా, 'తాజ్‌మహల్ అందం'పై జీజీవీ ఎస్‌వీ ప్రసాద్ తీసిన ఫొటోకు ద్వితీయ బహుమతి, పిట్టల మహేష్ తీసిన 'ప్రభల తీర్థం' ఫొటో తృతీయ బహుమతికి ఎంపికయ్యాయి. మోనోక్రోమ్ విభాగంలో వనం శరత్‌బాబు ఫొటో 'నీరు విలువైనది' ప్రథమ బహుమతికి ఎంపికకాగా, మహేష్.జి తీసిన 'బ్లడీ ఫైట్'కు ద్వితీయ బహుమతి, వనమామలై శ్రీనివాసాచారి ఫొటో 'కమ్యూనిటీ బావి'కి తృతీయ బహుమతికి ఎంపిక చేశారు. రెండు కేటగిరీల్లోనూ అయిదేసి ఫొటోల చొప్పున పది ఫొటోలు మెరిట్ సర్టిఫికెట్‌కు ఎంపికయ్యాయి. సబ్జెక్ట్, కంపోజిషన్, టెక్నికల్స్, లైటింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ప్రకటించినట్టు ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ కానాల సుధాకరరెడ్డి తెలియజేశారు. త్వరలో జరగనున్న ప్రత్యేక సభలో విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

బెదిరింపులకు దిగిన టీడీపీ కౌన్సిలర్

తెనాలి అర్బన్: స్థానిక బోసు రోడ్డులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ భవన నిర్మాణాన్ని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. దీంతో సదరు భవన యాజమాని, టీడీపీ కౌన్సిలర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. బోసు రోడ్డు టౌన్ చర్చి పక్క రోడ్డులో ఓ వ్యక్తి సెల్లార్ జి+2 ఫ్లోర్‌కు అనుమతులు తీసుకున్నారు.ఈ మేరకు భవనాన్ని నిర్మించారు. అదనపు అంతస్తు నిర్మాణం కోసం పిల్లర్లను ఏర్పాటు చేస్తుండటంతో మున్సిపల్ అధికారులకు సమాచారం వచ్చింది. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు సిబ్బందితో అక్కడకు వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నించారు.

ఇంతలో అక్కడకు వచ్చిన టీడీపీ కౌన్సిలర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అంతు చూస్తానంటూ బెదిరించినట్లు సమాచారం. వాదోపవాదల అనంతరం నిర్మాణాన్ని ఆపినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

ద్విచక్ర వాహన దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

రేపల్లె: ద్విచక్ర వాహన దుండగులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం దుండగుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన పట్టణంలోని రింగు రోడ్డు సెంటర్‌లో బొర్రా కృష్ణ తన ద్విచక్ర వాహనాన్ని సెంట్రల్ పార్కింగ్ చేసి దుకాణానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి తన వాహనం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రేపల్లె-పెనుమూడి రోడ్డులో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొల్లూరుకు చెందిన ముగ్గురు బాలురు పట్టుబడ్డారు. వారిని విచారించగా ద్విచక్ర వాహనాన్ని దొంగిలించడంతో పాటు పలు నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.9.6 లక్షల విలువైన 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ వీరికి గతంలో నేర ప్రవృత్తి లేదని పేర్కొన్నారు. డబ్బుల కోసం ఇటువంటి నేరాలకు పాల్పడటం ప్రారంభించారన్నారు. యూట్యూబ్‌లో వచ్చే వివిధ అంశాలను పరిశీలించి ఈ దొంగతనాలు సులభంగా చేయడం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను గమనిస్తూ ఉండాలని చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 189.0మి.మీ వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 189.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. మొత్తం 28 మండలాలకుగాను ఎనిమిది మండలాల్లో వర్షం పడలేదని పేర్కొన్నారు. అత్యధికంగా వెల్దుర్తిలో 32.0మి.మీ వర్షం పడగా అత్యల్పంగా నకరికల్లులో 0.6 కురిసింది. దుర్గి 14.2, రెంటచింతల 8.2, గురజాల 6.6, కారంపూడి 4.2, పిడుగురాళ్ల 1.8, క్రోసూరు 2.4, అమరావతి 1.8, బొల్లాపల్లి 12.6, వినుకొండ 3.8, నూజెండ్ల 4.8, శావల్యాపురం 6.2, ఈపూరు 8.6, రొంపిచర్ల 4.2, నరసరావుపేట 4.8, ముప్పాళ్ల 4.4, నాదెండ్ల 18.2, చిలకలూరిపేట 26.8, యడ్లపాడు మండలంలో 22.8 మి.మీ వర్షం కురిసింది.

రోగులకు సహనంతో సేవలు అందించాలి

రేపల్లె: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు సహనంతో వైద్య సేవలను అందించాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పద్మావతి పేర్కొన్నారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు అధికంగా అయ్యేలా పనిచేయాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నందున జాగ్రత్త వహించి వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యశాలలో సదుపాయాలన్నీ అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వైద్యశాలలో రికార్డులు పరిశీలించి వివిధ రోగుల గదులను పరిశీలించారు.